గురుబ్రహ్మనగర్‌లో స్థల వివాదం

గ్రీన్‌బెల్టు అంటూ ఈవీడీఎం అధికారుల కూల్చివేతలు.. ప్రహరీ నిర్మాణం

- పనులు నిర్వహిస్తే రాకపోకలు ఎలా అంటున్న గిరిజనులు
- న్యాయం చేయాలంటూ బైఠాయించిన బస్తీవాసులు


కూల్చివేతలు నిర్వహిస్తున్న ఈవీడీఎం అధికారులు


రోడ్డు పై బైఠాయించిన గురుబ్రహ్మనగర్‌కు చెందిన గిరిజనులు

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో స్థల వివాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఆ స్థలాన్ని గ్రీన్ బెల్టుగా అభివృద్ధి చేసేందుకు ప్రహరీ నిర్మించాలని కాలనీవాసులు. ప్రభుత్వ మిగులు స్థలమని ప్రస్తుతం రాకపోకలు సాగిస్తుండటంతో ఇప్పుడు నిర్మాణాలు చేపడితే తమకు రోడ్డు ఉండదని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో ఈవీడీఎం అధికారులు వివాదాస్పద స్థలానికి ఆనుకొని ఉన్న గుడిసెలను కూల్చివేసి ప్రహరీ నిర్మాణానికి పూనుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నందగిరిహిల్స్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు వచ్చి గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారు. ఈ ప్రాంతాన్ని బస్తీ కింద గుర్తించి పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. చివరకు అప్పటి మంత్రి దానం నాగేందర్ ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా ఇక్కడ ఉంటున్న 153 గిరిజన కుటుంబాలకు పట్టాలు మంజూరు చేశారు. అంతే కాకుండా జేఎన్‌యూఆర్ఎం పథకం కింద పక్కా గృహ నిర్మాణం చేపట్టేందుకు అప్పటి సీఎం రోశయ్య శంకుస్థాపన చేశారు. ఈ బస్తీకి గురుబ్రహ్మనగర్ అని నామకరణం చేశారు. హౌసింగ్ బోర్డు లేఅవుట్ కూడా సిద్ధం చేసింది. అయితే, నిధులు లేకపోవంతో నిర్మాణాలు ప్రారంభదశలోనే ఆగిపోయాయి. అప్పటి నుంచి గిరిజన కుటుంబాలు గుడిసెలు వేసుకొని కాలం వెల్లదీస్తున్నారు.

వివాదం ఏంటంటే...

కాలనీకి ఆనుకొని బస్తీ ఏర్పాటు విషయంలో కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. అయితే, ప్రభుత్వ స్థలంలో పేదలు ఉంటే ఏమవుతుంది అని ప్రజా ప్రతినిధులు వాదించారు. చివరకు గురుబ్రహ్మనగర్ బస్తీకి ఆనుకొని ఉన్న రెండు వేల గజాల స్థలాన్ని గ్రీనరీ కింద అభివృద్ధి చేయాలని కాలనీవాసులు షరతు పెట్టారు. ఇలా చేయడం వల్ల కాలనీ, బస్తీ మధ్య ఇది వారధిగా నిలుస్తుందన్నది వారి అభిప్రాయం. దీనికి ప్రజాప్రతినిధులు సమ్మతించారు. అయితే, బస్తీలో నిర్మాణాలు చేపట్టాలంటే ఈ స్థలం నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కాబట్టి నిర్మాణాలు పూర్తయిన వెంటనే గ్రీన్ బెల్టు లేదా ఇతర ప్రభుత్వ పనులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వ్యవహారం ఇక్కడితో ఆగిపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుబ్రహ్మనగర్‌లో డబుల్ బెడ్‌రూంలు నిర్మించాలని ప్రతిపాదనలు చేసింది. కానీ, ఆ వెంటనే ఎన్నికలు రావడంతో ప్రతిపాదన మరుగున పడింది. ఇదిలా ఉండగా తాజాగా కాలనీకి చెందిన కొంత మంది గ్రీన్‌బెల్టు ఆక్రమణకు గురవుతుందని జీహెచ్ఎంసీ ఈవీడీఎం అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం సిబ్బంది కూల్చివేతలు చేసేందుకు బుల్‌డోజర్‌లతో వచ్చారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఉన్న గుడిసెలను కూల్చడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఈవీడీఎం డైరెక్టర్ రంగనాథ్ శుక్రవారం బస్తీలో పర్యటించారు. గ్రీన్ బెల్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఇదే తరుణంలో బస్తీ వాసుల డిమాండ్లను కూడా పరిగణలోకి తీసుకొని ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించారు. కానీ, శనివారం ఉదయం బస్తీ సరిహద్దులను నిర్ణయించి నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు పూనుకున్నారు. దీంతో బస్తీవాసులు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలియగానే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బస్తీకి చేరుకున్నారు. నిర్మాణాలు ఆపాలని అధికారులకు సూచించారు. ఈవీడీఎం డైరెక్టర్ రంగనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలాలు, చెరువులు కబ్జా అవుతుంటే పట్టించుకోవాలి కానీ, గిరిజనులను అన్యాయం చేసేలా వ్యవహరిస్తే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


ప్రభుత్వం గెజిట్ ద్వారా ఆమోదించిన లేఅవుట్‌ను చూపిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బస్తీని తొలగించే కుట్ర

- ఎమ్మెల్యే దానం నాగేందర్

గురుబ్రహ్మనగర్ బస్తీ ఏర్పడి 30 సంవత్సరాలు అవుతుందని ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే బస్తీని తొలగించే కుట్ర జరుగుతుంది అనే అనుమానం వస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో కుంటలు, చెరువులు, నాలాలు కబ్జా అవుతున్నాయని అసెంబ్లీ సాక్షిగా తానే స్వయంగా ఫిర్యాదులు చేసినా చర్యలు చేపట్టని అధికారులు అసలు శాఖకు సంబంధం లేని గురుబ్రహ్మనగర్‌కు ఎందుకు వచ్చారో సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. గ్రీన్ బెల్టు అని వాదిస్తున్న వారు ఇప్పటికే ఇందులో కొంత స్థలాన్ని కబ్జా చేశారని వారి విషయంలో చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బస్తీ వాసులను అన్యాయం చేసేందుకు చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గృహ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించింది వాటితో ఇక్కడ పక్కా నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి రాగానే గురుబ్రహ్మనగర్ వ్యవహారం ఆయన దృష్టికి తీసుకెళ్లి గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఫిలింనగర్ 18బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, మున్నూర్ కాపు సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 14, 15తేదీల్లో పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ రెండో వార్షిక సదస్సు

పంజాగుట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ రెండో వార్షిక సదస్సుకు నగరం వేదిక కానుంది. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జూబ్లీహిల్స్ లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సదస్సు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సందీప్ కె.దాసరి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి సదస్సు బ్రోచరును ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మేధావులు పాల్గొంటారని, రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ధార్మిక ఉపన్యాసాలు, చర్చా గోష్ఠులు ఉంటాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సి.చంద్రశేఖర్, గుణశేఖరన్, డాక్టర్ చలపతిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న నగరానికి మంద కృష్ణ మాదిగ రాక

- ఘన స్వాగతం, భారీ ర్యాలీకి ఏర్పాట్లు

పంజాగుట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధక్షుడు మందకృష్ణ మాదిగ పోరాటాలతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, వర్గీకరణపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన తరువాత ఢిల్లీ నుంచి మందకృష్ణ మాదిగ ఈనెల 13న నగరానికి వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎం.నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. ఆ రోజు నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్యాంక్ బండ్‌పై అంబేడ్కర్ విగ్రహానికి, ఎల్బీస్టేడియం సమీపంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతారని తెలిపారు. ర్యాలీ బాగ్అంబర్‌పేట డీడీ కాలనీలోని ఆయన నివాసం వరకు కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొంటారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకరించిన వారందరూ పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పీ నాయకులు వి.సూరన్న, లక్ష్మణ్ మాదిగ, నరేంద్రబాబు, సామెల్, నరసింహమాదిగ, భైరపోగు శివకుమార్‌మాదిగ, మల్లికార్జున, రామకృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జాతీయ త్రోబాల్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వచ్చే అక్టోబరు నెలలో జాతీయ జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయని రాష్ట్ర త్రోబాల్ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి జగన్‌మోహన్ గౌడ్ తెలిపారు. బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నామని, జాతీయ త్రోబాల్ సంఘం, శాట్జ్ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు జగన్ చెప్పారు.

ఐటీఎఫ్ రన్నరప్‌గా కార్తీక్


రన్నరప్ ట్రోఫీతో కార్తీక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ టెన్నిస్ 25కే ఐటీఎఫ్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారుడు గంటా సాయికార్తీక్ రెడ్డి జోడీ రన్నరప్‌గా నిలిచింది. శనివారం తైపీలో జరిగిన ఫైనల్స్‌లో సాయికార్తీక్-ట్రాంగ్‌చా రోయింఛైకుల్ (థాయ్‌లాండ్) ద్వయం 6-7, 5-7తో ఐసారో ప్రుచాయ (థాయ్‌లాండ్)-రుంగ్‌కాట్ క్రిస్టోఫర్ (ఇండోనేసియా) జోడీ చేతిలో పోరాడి ఓడింది. కార్తీక్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి.

ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటాలి


సనత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటాలని కార్పొరేటర్ కొలను లక్ష్మి సూచించారు. సనత్‌నగర్ డివిజన్ జయప్రకాష్‌నగర్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ కొలను లక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు జ్యోష్న, సంధ్య, కైలాష్, మూర్తి, సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి కాలనీవాసులు దాసు, సాయినాథ్‌రెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ దేవాలయం వార్షికోత్సవం


నల్లపోచమ్మ దేవాలయంలో పూజాధికాలు నిర్వహిస్తున్న టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌లో నల్లపోచమ్మ దేవాలయం 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరయ్యారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభినిర్యాణం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆకెళ్ల రాఘవేంద్ర, సినీ దర్శకుడు ఫణీంద్రనరిశెట్టి

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): యువ రచయిత ప్రవర్ష మల్లాది రచించిన అభినిర్యాణం పుస్తకాన్ని జూబ్లీహిల్స్‌లో శనివారం సాహితీవేత్త, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర, సినీ దర్శకుడు ఫణీంద్ర నరిశెట్టి, గోదావరి ప్రచురణల అధినేత రాయుడు సత్తిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పెంపొందించే విధంగా పుస్తకాన్ని రాశారని అన్నారు. ఫణీంద్ర నరిశెట్టి మాట్లాడుతూ పుస్తకం రాసేందుకు రచయిత నాలుగేళ్ల పాటు పరిశోధన చేయడం అభినందనీయమన్నారు.

'ఖైరతాబాద్ ఉప ఎన్నికలో విజయం మాదే'

ఖైరతాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ అసెంబ్లీకి ఉపఎన్నికలు రాబోతున్నాయని, అందులో బీఆర్ఎస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌ను కలిసి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తమ పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పక పడుతుందని కేటీఆర్ తెలిపారని పేర్కొన్నారు. పార్టీ వర్గాలు ఐక్యంగా ముందుకు వెళ్తూ ప్రజల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారని గజ్జెల నగేష్ తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, గజ్జెల ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉచితమెగా కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేస్తున్నట్లు మెడికవర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీహైటెక్‌సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు పలువురు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జరీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ ఫిజిషియన్ వైద్యులు ఈ వైద్యశిబిరంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. దీర్ఘకాలిక దగ్గు, దగ్గినప్పుడు రక్తం రావడం, తరచుగా జ్వరం, ఇన్ఫెక్షన్లు రావడం, శరీరంపై గడ్డలు, లింఫ్ నోడ్స్‌వాపు, చనుమొనల నుంచి ద్రవం స్రవించడం, యోని నుంచి అధిక మోతాదులో డిశ్చార్జీ కావడం, రుతుస్రావం గడ్డలుగా రావడం లక్షణాలతోపాటు, కుటుంబ నేపథ్యంలో కేన్సర్ ఉన్నవారు, దీర్ఘకాలికంగా పొగతాగే వారు, పొగాకు నమిలే వారు, రేడియేషన్‌కు అతిగా గురయ్యే వారు, కాలుష్యం, కెమికల్స్ వాటిల్లో పనిచేసే వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, మమోగ్రఫీ పరీక్షలను నిర్వహిస్తారని, వివరాల కోసం ఫోన్ నం.9154316236/040 68334455లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

పంజాగుట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ డీ-బ్లాక్‌లో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య, మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి హనుమంత్‌రావు, కోశాధికారి సుగుణ, నాయకులు రాజేంద్రప్రసాద్, ఉప్పలయ్య, సత్యసాయికుమార్, పద్మావతి, చంద్రవతి, శబరీష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన 21మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు 21,02,436 రూపాయల విలువగల చెక్కులు, ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య బీఆర్ఎస్ నాయకులు విజయ్ ముదిరాజ్, ఏ.రామకృష్ణ, పి.బాలరాజు, ఆంజనేయులు, జి.బాలకృష్ణ, పవన్, యాదగిరి, అర్జున్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మానవ చర్యల వల్ల పర్వత శ్రేణులకు భంగం : పర్యావరణ వేత్తలు


మాట్లాడుతున్న పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

పంజాగుట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో తూర్పు, పశ్చిమ, హిమాలయాల్లో అనేక పర్వత శ్రేణులు ఉన్నాయని, అడవుల నరికివేత, మైనింగ్, రహదారి వెడల్పు, కొత్త రహదారులు, రైల్వేలైన్లు వేయడం, పర్యాటకరంగ అభివృద్ధి, మానవ చర్యల వల్ల పర్వత శ్రేణులకు భంగం వాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పబ్లిక్ పాలసీ విశ్లేషకుడు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, అంతర్జాతీయ జీవవైవిధ్య నిపుణుడు డాక్టర్ కె.తులసీరావు, గ్రేస్ అధ్యక్షుడు ఆర్.దిలీప్‌రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి మాట్లాడారు. ఒడిషా, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో విస్తరించిన తూర్పు కనుమలలో కొండచరియలు విరిగిపడే ప్రమాదంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. అడవుల నరికివేత, మైనింగ్, రహదారి వెడల్పు, కొత్త రహదారులు, రైల్వేలైన్లు వేయడం, పర్యాటకరంగ అభివృద్ధి, మానవ చర్యల వల్ల పర్వత శ్రేణులకు భంగం వాటిల్లుతోందని దీంతో తూర్పు కనుమలలో నేల కోతకు, భూమి వదులుగా మారడానికి కారణమై, అధిక వర్షాలు సంభవించినప్పుడు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అన్నారు. పట్టణీకరణ, విచక్షణారహిత అభివృద్ధి కార్యకలాపాల వల్ల ముప్పు ఉందని అన్నారు. తూర్పు కనుమల జీవవైవిధ్యానికి ముప్పు పొంచి ఉందని, అందుకే వాటి పరిరక్షణకు ప్రత్యేక హోదా కల్పించాలని వారు సూచించారు. కృష్ణా, గోదావరి, మహానది, శారద, రుషికుల్య, వైగై వంటి తూర్పు కనుమలను దాటే, పుట్టే అనేక నదులు ఎండిపోతున్నాయి, లేదా వరదలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తూర్పు కనుమలను ప్రపంచ సహజ వారసత్వ ప్రదేశంగా ప్రకటించడానికి ఐక్యరాజ్యసమితిని ఒప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

బీపీ మాండల్, పుంజాల శివ శంకర్.. బీసీలకు రెండు కళ్లు

ఖైరతాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీపీ మాండల్, పుంజాలా శివశంకర్‌లు బీసీలకు రెండు కళ్లలాంటివారని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. జస్టిస్ పుంజాలా శివశంకర్ 95వ జయంతి సందర్భంగా శనివారం లక్డీకాపూల్‌లోని టీబీసీఈఎఫ్ భవన్‌లో ఆయన జయంతి సభ జరిగింది. ఇందులో చంద్రకుమార్ మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడంతో పుంజాల శివకుమార్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రొఫెసర్ తిరుమల మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం వ్యూహాత్మకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శివకుమార్ గొప్ప నిబద్ధత కలిగిన బీసీ యోధుడన్నారు. ప్రొఫెసర్ సింహాద్రి మాట్లాడుతూ బీసీ కావడంవల్లే శివశంకర్ చరిత్ర ఎక్కడా లిఖించబడలేదని, ఆయన జీవితం పాఠ్యాంశాల్లో చేర్చదగినదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు దుర్గం రవీందర్, దేవళ్ల సమ్మయ్య, ప్రముఖ కళాకారుడు వరంగల్ శ్రీనివాస్, ప్రతినిధులు రజిత్ ఆకుల, వినోద్, భద్రయ్య, విజయ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

'పోలీసుల తీరుపై న్యాయపోరాటం చేస్తాం'

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తొట్టెల ఊరేగింపు జరుగుతున్న సమయంలో జరిగిన స్వల్ప తోపులాట సందర్భంగా పోలీసులు తమపై దాడి చేశారని, ఈ విషయమై తాము న్యాయపోరాటం చేస్తామని బాధితులు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో బాధితులు నాగేంద్ర, శివ, అనిల్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం తొట్టెల ఊరేగింపు సందర్భంగా బిల్లాపవన్ అతని మనుషులతో జరిగిన గొడవలో పోలీసులు తమపై కేసులు బనాయించటం అన్యాయమని అన్నారు. ఈనెల 4న అర్ధరాత్రి యాదగిరినగర్‌లో రౌడీషీటర్ బిల్లాపవన్ తన అనుచరులతో కలిసి తొట్టెల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాడని, యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్దకు రాగానే మద్యం తాగి ఉన్న అనేకమంది తమను రెచ్చగొట్టారని, ఆ సమయంలో జరిగిన గొడవలో అక్కడ ఉన్న ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు అదుపు చేయలేకపోయారని తెలిపారు. ఈ గొడవలో పోలీసులు తమను దోషులను చేస్తూ మర్డర్, మానభంగం చేసిన వారిని తీసుకెళ్లినట్లు ఇళ్లలోకి చొరబడి రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లారని, అనంతరం ఏసీపీ కార్యాలయంలో పోలీసులు తమని కొట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ కన్వీనర్ వినవీన్‌యాదవ్ మాట్లాడుతూ చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతికే వారిని రోడ్డుమీద తిట్టుకుంటూ, బెదిరిస్తూ తీసుకెళ్లి 307కేసు పెట్టటం సరికాదన్నారు. .

వ్యాపారిని బెదిరించిన హోంగార్డ్, మరో వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసులమని వ్యాపారిని బెదిరించిన హోంగార్డ్, మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన ఎం.శ్రీకాంత్ అన్నపూర్ణ స్టూడియో వద్ద పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 8న సాయంత్రం శ్రీకాంత్ షాప్‌లో లేని సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసులమని చెప్పి సోదాలు చేయడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ అక్కడికి చేరుకున్నారు. అందులో ఓ వ్యక్తిని ప్రశ్నించగా తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని గుట్కాలు అమ్ముతున్నట్టు ఫిర్యాదులు అందగా సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు కాకుండా ఉండాలంటే ఐదు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అనుమానం వచ్చిన శ్రీకాంత్ సోదరుడితో కలిసి వారిని పట్టుకొని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ప్రశ్నించగా నిందితుల్లో సైబరాబాద్ ఎస్ఓటీలో హోంగార్డ్‌గా పనిచేస్తున్న బదుల్లాతో పాటు మరో వ్యక్తి నరసారెడ్డి అని తేలింది. వీరిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పోలీసుల విదులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. నానక్ రాంగూడాకు చెందిన రుచిత్‌రెడ్డి ఈనెల 9న మాదాపూర్ పబ్‌లో పీకలదాకా మద్యం తాగాడు. ఇద్దరు యువతులతో కలిసి కారులో జూబ్లీహిల్స్ నీరూస్ చౌరస్తాకు చేరుకున్నాడు. అక్కడే డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు అతని కారును ఆపి శ్వాశ పరీక్ష చేసేందుకు ప్రయత్నించారు. కానీ, రుచిత్‌రెడ్డి సహకరించకపోగ పోలీసులను దుర్భాషలడాడు. దీంతో ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు జూబ్లీ హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని రుచిత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

బోరబండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. శ్రీరాంనగర్ బెంగళూరు అయ్యంగార్ స్వీట్‌షాప్ వెనుక వైపున ఉన్న డీలర్ షాపు నం.775 నుంచి అక్రమంగా 357 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పౌరసరఫరాల అధికారులు, బోరబండ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రేషన్‌బియ్యం పట్టుకున్నారు.

ఆదర్శంగా వాసవీ సేవా కేంద్రం కార్యక్రమాలు

- ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా కేంద్రం ఏటేటా సేవలను విస్తృత పరుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు సీతయ్య గుప్తా 113వ జయంతి సందర్భంగా ఖైరతాబాద్‌లోని సేవా కేంద్రం ప్రాంగణంలోని సీతయ్య గుప్తా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, కార్పొరేటర్ విజయారెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతల చేతుల మీదుగా పేద మహిళలకు కుట్టు మిషన్లు, సైకిళ్లు, తోపుడు బండ్లు అందజేశారు. పేద వృద్ధులకు పింఛన్లు, ఉచితంగా బియ్యం పంపిణీ చేయడంతో పాటు పేద మహిళల స్వయం ఉపాధి కోసం వాసవీ మహిళా కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా కేంద్రం కొల్వూరు రమేష్, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేంద్రకుమార్, జీవితకాల సలహాదారులు, మాజీ అధ్యక్షులు కొండ్లె మల్లిఖార్జున్, చీకటిమర్ల అశోక్‌కుమార్, కాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ రాజేష్ కోలావాల్, ప్రతినిధులు కూర జయరాములు గుప్తా, సీతయ్యగుప్తా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఖైరతాబాద్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేశ్ మండపాల నిర్వాహకులతో పోలీసులు శనివారం సమావేశమై పలు సూచనలు చేశారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిర్వాహకులు ఎప్పటిమాదిరిగానే మండపాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు నాగరాజు, సందీప్‌రెడ్డి, శ్రీరాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్‌హోమ్ నుంచి యువతి పరార్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌హోమ్ నుంచి యువతి పారిపోయిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ(స్టేట్‌హోమ్)లో తుమ్మల అరుణ ఆయా విధులు నిర్వహిస్తుంది. ఈనెల 9న అరుణ బాత్‌రూమ్‌కు వెళ్లగా అక్కడ ఆశ్రయం పొందుతున్న 17 ఏళ్ల యువతి గుట్టు చప్పుడు కాకుండా బీరువా తెరచి ఆమె ఫోన్‌ను తీసుకుంది. అనంతరం గేట్లు తెరుచుకుని పారిపోయింది. బాత్‌రూమ్ నుంచి వచ్చిన ఆయా అరుణకు యువతి కనిపించలేదు. వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసింది. ఆ యువతి గతంలో కూడా పారిపోయింది. అధికారుల సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం కూల్చివేతలు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. రహ్మత్‌నగర్ మహాత్మానగర్ బస్తీలోని ప్రభుత్వ స్థలంలో ఏ.యాదమ్మ కుటుంబం నిర్మాణం చేపట్టింది. శనివారం ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ ఆదేశాల మేరకు ఆర్ఐ అనిల్ తన సిబ్బందితో వచ్చి నిర్మాణంలో ఉన్న కట్టడాన్ని కూల్చివేశారు. కాగా, తమ వద్ద పట్టా ఉందని అందుకే కట్టుకుంటున్నామని ఏ.యాదమ్మ కుటుంబం తెలపగా, డాక్యుమెంట్‌లు కార్యాలయానికి వచ్చి చూపించాలని అధికారులు సూచించారు. ఈ స్థలం విషయంలో గతంలో కూడా ఇలాంటి వివాదం చోటు చేసుకుంది.

అధ్వానంగా మరుగు దొడ్లు


మరుగు దొడ్ల వద్ద మురుగు నీటితో నిండిన ట్యాంక్

పద్మారావునగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని హమాల్‌బస్తీలో రోజువారి కూలీలు ఇరుకైన ఇళ్లలో జీవిస్తున్నారు. ఇక్కడ కొన్ని కుటుంబాలు వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించుకునే స్థితిలో లేరు. దీంతో వీరు ప్రభుత్వం కట్టించిన మరుగు దొడ్లను తప్పని పరిస్థితిలో ఉపయోగిస్తున్నారు. ఈ మరుగు దొడ్లు అపరిశుభ్రంగా మారాయి. మరుగు దొడ్ల పక్కన ఉన్న ట్యాంక్ మురికి నీటితో నిండింది. దీంతో దోమలు ఉత్పత్తి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో సైతం మరుగు దొడ్ల పరిసరాలను శుభ్రం చేయకపోవటం విచారకరం. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి మరుగు దొడ్ల పరిసరాలను శుభ్రపరచి, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బస్తీబాటలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్‌లో బీజేపీ బస్తీబాట

మారేడుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఎల్లప్పుడూ ప్రజల కోసం పనిచేస్తారని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె. రామకృష్ణ అన్నారు. శనివారం కంటోన్మెంట్ బోర్డు 4 వార్డు పరిధిలోని హరిజన బస్తీ, అంబేడ్కర్ సేవా సంఘం, రాంనగర్, పికెట్‌లో బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా బస్తీల్లో పాదయాత్ర చేపట్టి స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, వార్డు అధ్యక్షుడు రాజ మల్లేష్, సీనియర్ నాయకులు టోపీ శంకర్, నాగభూషన్ రెడ్డి, ఓంకార్, సరీశ్, జగన్, లక్ష్మన్, దీన్‌దయాళ్, ప్రేమ్‌కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

వారాసిగూడలో విరబూసిన బ్రహ్మకమలం


ఓ ఇంట్లో వికసించిన బ్రహ్మకమలం పువ్వు

బౌద్ధనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో శుక్రవారం ఓ ఇంట్లో బ్రహ్మకమలం పువ్వు వికసించింది. స్థానికంగా నివసించే లాలయ్యాముదిరాజ్, అలివేలు ఇంట్లో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలం పువ్వు వికసించటంతో స్థానికులు వచ్చి తిలకించారు.

నేటి నుంచి విశ్వశాంతి కోసం కోటి కుంకుమార్చన

సికింద్రాబాద్, పద్మారావునగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశ పురోగతి, విశ్వశాంతి, ప్రజా సంక్షేమం కోసం ఈనెల 11 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ఆవరణలో వారణాసికి చెందిన స్వామి అభిషేక్ బ్రహ్మచారి దివ్యాశీస్సులతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కోటి కుంకుమార్చన మహాయజ్ఞం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణచారి తదితరులు

శాస్త్రీయ, సంగీత నృత్యాలపై మరింతగా పరిశోధన జరగాలి

తార్నాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీతంలో భాగమైన శాస్త్రీయ, సంగీత నృత్యాలపై మరింతగా పరిశోధన జరగాలని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణచారి అన్నారు. నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఓయూలోని ఆంధ్ర మహిళా సభలో రెండు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన లలిత కళల ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నృత్య, సంగీత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకురాలు జి.వసుంధర, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వి.వి జయ్‌కుమార్, నృత్య గురువులు పి.వి.రమణ, స్నేహ, రామచందర్, మధుమతి కులకర్ణి, రేణుక, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల బదిలీల్లో సామాజిక న్యాయం పాటించాలి

- **బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్**

తార్నాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో వివిధ శాఖల్లో జరిగే బదిలీల్లో మెజారిటీగా ఉన్న బీసీలను గుర్తించి సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ అధికారులకు ప్రాధాన్యత లేని శాఖలు కేటాయిస్తూ.. బీసీల పట్ల సవితి తల్లి ప్రేమ ప్రదర్శిస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెజారిటీగా ఉన్న బీసీలను గుర్తించి భవిష్యత్‌లో జరిగే బదిలీల్లో సామాజిక న్యాయం పాటించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.


వివరాలు వెల్లడిస్తున్న లాలాగూడ పోలీసులు

పని ఇప్పిస్తామంటూ నగల అపహరణ

- **ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్**

అడ్డగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పని ఇప్పిస్తామంటూ నగలు అపహరించిన ఇద్దరు పాత నేరస్థుల్ని లాలాగూడ పోలీసులు అరెస్టు చేసి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీలు నర్సయ్య, జైపాల్‌రెడ్డి, సీఐ కరుణాకర్‌రెడ్డితో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. హస్తినాపురానికి చెందిన హరినాయక్ (45), వడ్డె లక్ష్మి (40) పాత నేరస్థులు. ఈనెల 3న అత్తాపూర్‌లో ఓ మహిళను పరిచయం చేసుకున్నారు. పని ఇప్పిస్తామని చెప్పి ముగ్గురు కలిసి అత్తాపూర్‌లో కల్లు సేవించి సికింద్రాబాద్ లాలాగూడలోని లోకో షెడ్డు ప్రదేశానికి వచ్చారు. మత్తులో ఉండగా హరినాయక్, లక్ష్మి ఆ మహిళ వద్ద బంగారు ఆభరణాలు, 3 తులాల వెండి గొలుసును అపహరించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు సుమారు 200 సీసీ కెమెరాలను శోధించారు. సికింద్రాబాద్ పాట్ మార్కెట్‌లోని బంగారు దుకాణాల వద్ద అనుమానాస్పదంగా తిరిగినట్లు గుర్తించి వారిద్దరిని అరెస్ట్ చేశారు. కాగా, చోరీ సొత్తును కొనుగోలు చేసిన ఇద్దరు జ్యువెలరీ దుకాణ యజమానులపై కూడా కేసు నమోదు చేశారు.

బోనాల జాతరకు ఆలయాల ముస్తాబు

- నేడు బన్సీలాల్‌పేట్‌లో బోనాలు


బోయగుడాలోని మారమ్మ ఆలయం


బండ మైసమ్మ దేవాలయం


బీజేఆర్ నగర్‌లోని నల్ల పోచమ్మ ముత్యాలమ్మ దేవాలయం

పద్మారావునగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గం పరిధి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఆది, సోమవారాల్లో శ్రావణమాస బోనాలు జరగనున్నాయి. పలు ఆలయాలను రంగులతో, విద్యుత్ దీపాలతో, వివిధ రకాలైన పూలతో అందంగా అలంకరించారు. బోయగుడా, కళారంగ్ బస్తీ, ఐడీహెచ్ కాలనీ, గొల్ల కొమురయ్య కాలనీ, ఉప్పలమ్మ టెంపుల్, బీజేఆర్ నగర్, న్యూ బోయగుడా, బన్సీలాల్‌పేట్ డి క్లాస్, బొక్కలగుడా, బండ మైసమ్మ నగర్‌లలోని ఆలయాల నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. బోనాల వేడుకలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సనత్‌నగర్ నియోజనవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, కార్పొరేటర్ కుర్మ హేమలత పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా ఆలయాల పరిసరాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడ్డ చెట్ల కొమ్మలు

- రోడ్డుకు అడ్డంగా ఒరిగిన స్తంభం
- తప్పిన పెను ప్రమాదం
- సకాలంలో స్పందించిన అధికారులు


చెట్ల కొమ్మలు విరిగిపడడంతో ఒరిగిన స్తంభం

మారేడుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీలో రోడ్డు నంబర్ 7 వీధి నంబర్ 4లోని ఓ అపార్ట్‌మెంట్‌కు ఏర్పాటు చేసుకున్న 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసందానంగా ఉన్న విద్యుత్ స్తంభంపై శనివారం ఉదయం 6 గంటలకు చెట్ల కొమ్మలు విరిగి స్తంభంపై పడ్డాయి. చెట్ల కొమ్మల బరువుకు స్తంభం రోడ్డుకు అడ్డంగా ఒరిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు, కెబుల్ వైర్లు తెగిపోయాయి. ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌కు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ సైతం దెబ్బతింది. దీంతో కాలనీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టడంతో గంటల తరబడి విద్యుత్ అంతరాయం నెలకొంది. డీఆర్‌ఎఫ్ సిబ్బంది వచ్చి చెట్ల కొమ్మలును తొలగించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అపార్ట్‌మెంట్ వాసులు ట్రాన్స్‌ఫార్మర్లకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లకు ట్రిమ్మింగ్ ఎప్పటికప్పుడు చేయించాలని అధికారులు సూచిస్తున్నారు. మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీ రోడ్డుకు ఇరువైపులా చెట్లకు కొమ్మలు జిగురుగా పెరిగాయి. పలు ప్రదేశాల్లో కొమ్మలు రోడ్లపై వేలాడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

పార్సీగుట్టలో మహనీయుల విగ్రహాల శుద్ధి

బౌద్ధనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ పిలుపు మేరకు బౌద్ధనగర్ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పార్సీగుట్టలో మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి శుభ్రం చేసి క్షీరాభిషేకం చేశారు. మేకల కీర్తి, సత్యనారాయణ, రాజ్‌కుమార్, శ్యామ్‌రాజ్, కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు


దూద్‌బావిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

హరిహరకళాభవన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పిలుపు మేరకు మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమమంలో భాగంగా మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, నాగేశ్వర రెడ్డి, ఆవులు గణేష్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

కవులు దాశరథి, సినారె వారసులవ్వాలి

చిక్కడపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కవులు నిరంతర కవులుగా మారాలని అప్పుడే దాశరథి, సినారె వారసులవుతారని ప్రముఖ సాహితీవేత్త డా.ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలుగు భాషా చైతన్య సమితి, నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్, త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి, డా.సి.నారాయణరెడ్డి పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం మధ్యాహ్నం గానసభలో ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ కవులు నిరంతరం కవిత్వం రాయాలని సూచించారు. దాశరథి, సినారెలు తెలుగు సాహిత్య అభివృద్ధికి చేసిన కృషి అనన్యసామాన్యం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, సంఘసేవకులు శ్రీనివాస్‌యాదవ్, రామకృష్ణచంద్రమౌళి, వేమూరి అనంతరామకృష్ణశర్మ, అంజనీకుమారి, పాలడుగు సరోజినీదేవి, దాశరథి పురస్కారగ్రహీత కర్నాటి రఘురాములు గౌడ్, సినారె పురస్కారగ్రహీత గజవెల్లి సత్యనారాయణస్వామి, నిర్వాహకులు బడేసాబ్ పాల్గొన్నారు. మంజుల వేమూరి ఈసందర్భంగా దాశరథి, సినారె సినీగీతాలను మధురంగా ఆలపించారు. రాధా కుసుమ పర్యవేక్షణలో కవిసమ్మేళనం జరిగింది.


దాశరథి, డా.సి.నారాయణరెడ్డి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి, తదితరులు

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే తిరుగుబాటే

- **బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం**


సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

బర్కత్‌పుర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పెంచకుండా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల తిరుగుబాటు తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు అనుగుణంగా తక్షణమే బీసీ కులగణనను చేపట్టిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో స్థానికసంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు జి.మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్‌నేత తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ సయ్యద్ మోహిన్ కోరారు. శనివారం బోలక్‌పూర్‌లోని బైబిల్‌హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మోహిన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని బస్తీల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఏఎన్ఎం లక్ష్మీబాయి, ప్రేమలత, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకట్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కళాధర్‌నగర్‌లో అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి

ముషీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని కళాధర్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ కళాధర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శనివారం కళాధర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షుడు నరేందర్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సతీష్‌బాబు మాట్లాడారు. కళాధర్‌నగర్ పార్కు సమీపంలో ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి నాలుగు అంతస్తుల భవనం నిర్మించారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





బేగంపేట్ విల్లా మేరీ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే ను సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపు ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి హుండీల లెక్కింపు

సికింద్రాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతర హుండీలను ఈనెల 12వ తేదీన లెక్కించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని అధికారులు వివరించారు.

రేషన్‌షాపులను తనిఖీ చేసిన కార్పొరేటర్


సీతాఫల్‌మండిలో రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు రేషన్‌షాపులను శనివారం కార్పొరేటర్ సామల హేమ తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో రికార్డులను పరిశీలించారు. రేషన్ సరుకులు సరిగ్గా అందుతున్నాయో లేదో అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. అవకతవకలు జరగకుండా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లుకు సూచించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

అల్వాల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం అల్వాల్‌లోని జయశంకర్ విగ్రహం వద్ద ఉద్యమకారుల చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణతో పాటు యాత్రకు సంబంధించిన ర్యాలీని టీజేఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి, ఛైర్మన్ చీమ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మారం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ రాంబాబు, తాడూరి గగన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, 1969 కోఆర్డినేటర్ మూఠా కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అల్వాల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సక్రమంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగవని ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కొంపల్లిల్లోని ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన డ్రైవర్లతో పాటు క్లీనర్, ఆయాలకు విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళుతున్నప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఏ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రభుత్వ స్థలంలో చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు

మల్కాజిగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి మారుతీనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఎట్టకేలకు చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు అయ్యింది. ఈ స్థలం ఎంతో కాలంగా కొందరి చేతుల్లో కబ్జాగా ఉండిపోయింది. కాగా, కొంతకాలంగా ఈ స్థలాన్ని కాపాడేందుకు స్థానిక కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు ఈ స్థలం చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటుచేసి అందులో చిన్నారుల ఆటపరికరాలు, పచ్చదనం ఏర్పాటు చేయించారు. దీంతో మారుతీనగర్‌లో ఓ చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ స్థలాన్ని కాపాడిన కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి

మచ్చబొల్లారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యాచరణ కార్యదర్శి డి. వినోద్ కుమార్ అన్నారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ సూర్యనగర్‌కాలనీ సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్టూడెంట్ కౌన్సిల్ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులుగా ఎంపికైన విద్యార్థులకు రోలింగ్ షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జెరాడ్ సమ్యేల్, చంద్ర మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

అడ్డగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణంలో పనిచేస్తున్న భార్యభర్తలు ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడి భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలపై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని ఓ భవన నిర్మాణం జరుగుతుంది. భైరాగి, లచ్చమ్మలు భార్యభర్తలు. శనివారం భవన నిర్మాణ గోడలకు నీళ్లు పోస్తున్న సమయంలో చెక్క ఊడిపోవడంతో ఇద్దరు జారి కింద పడిపోయారు. ఈ క్రమంలో భర్త భైరాగికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మరణించాడు. లచ్చమ్మ గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కేసు దర్యాప్తులో ఉంది.

జన్మభూమి రైలులో నగల చోరీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలి నగల బ్యాగు చోరీ అయ్యింది. పీర్జాదిగూడ పరమేశ్వర కాలనీకి చెందిన వెంకటేశ్వరమ్మ గుంటూరులో ఉన్న బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లేందుకు శనివారం ఉదయం సికింద్రాబాద్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలెక్కింది. మౌలాలికి చేరుకోగానే తన బ్యాగు చెక్ చేసుకోగా 17 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది.